ఉప్పల్ చౌరస్తాలో నిర్వహించిన తెలంగాణ మానవ హారం



ఉప్పల్ చౌరస్తా నుంచి ర్యాలీగా పోలీసులు



అశ్వకదళంతో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



ఉత్సాహంగా..

ఉప్పల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ చౌరస్తాలో సురక్షా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తెలంగాణ మానవ హారం ఆకట్టుకుంది. మొదటగా నాగోల్ నుంచి ఉప్పల్ చౌరస్తా మీదుగా డీఎస్‌ఎల్ మాల్ వరకు పోలీసులు ర్యాలీగా వెళ్లి మాల్స్‌లోకి వచ్చిన వారికి పోలీస్ సేవలను వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం అక్కడి నుంచి ఉప్పల్ చౌరస్తాకు చేరుకొని తెలంగాణ మానవ హారాన్ని నిర్వహించారు. అందరూ సెల్‌ఫోన్లతో టార్చ్ లైట్లు వెలిగించిన దృశ్యం ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ మహంతి, మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ గోవింద్‌రెడ్డి ఎస్‌ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సురక్షా దివస్



బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

గౌతంనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న సురక్షా దివస్ కార్యక్రమాన్ని మల్కాజిగిరి పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరానెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీపీ జానకి దరావత్, ఏసీపీ నరేందర్‌రెడ్డి, మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ రవికుమార్, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌతంనగర్‌కు చెందిన శ్రీసాయి శ్రీనివాస క్యాటరింగ్ సహకారంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఇందిరానెహ్రూనగర్‌లో అన్నదానం చేస్తూ..

క్లుప్తంగా...

కల్యాణం కమనీయం



కల్యాణోత్సవంలో కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్: రాంరెడ్డినగర్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ, మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి కల్యాణోత్సవానికి ఆదివారం కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజిస్తే అన్ని శుభాలే కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పద్మావతి కాలనీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ స్వరూప్‌నగర్ పద్మావతి కాలనీ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా సముద్రాల నవీన్ కుమార్, కోశాధికారిగా ఎస్.అరవింద్‌ను ఎన్నుకున్నారు. కాలనీ పెద్దలు వట్టిపల్లి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, గూడూరు నరసింహరెడ్డి, మల్లేష్, కృష్ణ తదితరుల సమక్షంలో ఎన్నికలు జరిగాయి. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని ఆయన అన్నారు.

నయనానందకరం..



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహబూబాబాద్ నుంచి విచ్చేసిన కూచిపూడి నటి గురువులు ఉదయశ్రీ శిష్య బృందం తాండవ నృత్యకారి, ఆనంద నర్తన, ఆనంద తాండవం, మూషిక వాహన, జతి స్వరం, దశావతారాలు అంశాలను సరయు, గీతికా, రిషిత, మాళవిక, ఉపేక్ష, లిఖిత, తన్వి, ఉపాసన, శైశివాని, వేదశ్రీ, స్నేహితల నృత్యం ఆకట్టుకుంది.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం



గౌతంనగర్: పేద బ్రాహ్మణులకు బ్రాహ్మణ సేవా వాహిని బృందం అండగా ఉంటుందని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘు కిరణాచార్యులు అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన ప్రభాకర్ శర్మ మూడో కూతురు వివాహానికి రూ.51 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భాస్కర వజ్జుల వెంకటేశ్వర శర్మ, పతాంజలి శర్మ, ప్రచార కార్యదర్శి ఆవునూరు వెంకటేశ్వరావు, గ్రేటర్ కన్వీనర్ సుధాకర్‌రావు, ప్రభ, సునీత తదితరులు ఉన్నారు.

తెలంగాణ పోలీస్.. సేవలు భేష్

ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి

ఉప్పల్: తెలంగాణ రాష్ట్రంలో పోలీసు సేవలు, యంత్రాంగం పనితీరు భేష్ అని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. పోలీస్ సురక్ష దినోత్సవాన్ని ఉప్పల్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ దేవేందర్‌నగర్‌లో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ నినాదంతో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరం చేయాలంటే జంకుతున్నారన్నారు. అనుకోని ఘటనలు జరిగినప్పుడు నేరాలను ఛేదించడంలో పోలీసులు ఆధునిక టెక్నాలజీని వాడుతున్నారని, త్వరగా కేసులను ఛేదిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నరేష్‌రెడ్డి, డీసీ అరుణకుమారి, ఈఈ నాగేందర్, సీఐ గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ దేవేందర్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

దేశంలోనే మొదటిస్థానంలో..

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ పనితీరు దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో తెలంగాణ పోలీస్ ఆవిష్కరణలు-అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి జోన్ ఏసీపీ నరేష్‌రెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి, డీసీ శంకర్, సాయిజెన్‌శేఖర్, వాసుగౌడ్, కాటేపల్లి రవీందర్‌రెడ్డి, మేకల ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

ఐక్యత అభినందనీయం

మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీలో కాలనీవాసుల సహకారంతో కమ్యూనిటీ హాల్‌లో రూ.1.50 లక్షలతో అదనపు గదిని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. గదిని స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్, కాలనీ అధ్యక్షుడు భానుచందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్‌బాబు, కోశాధికారి వైకుంఠం, సలహాదారులు పీఎస్ఎన్ చౌదరి, రవికుమార్, సాజిద్, యాదగిరిచారి, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

మేడిపల్లి: మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సురక్షా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంతో తోడ్పాటు అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, మద్ది యుగేందర్‌రెడ్డి, సుమలత సత్యనారాయణ, సుభాష్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్, ఎస్ఐ కృష్ణయ్య, నాయకులు బండారు రవీందర్, బుచ్చియాదవ్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



మేడిపల్లి పోలీసులను సన్మానిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలి

బోడుప్పల్: పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో జీనస్ స్కూల్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఆధునిక పద్ధతిలో విద్యార్థులకు సులభంగా విద్యా బోధన చేయాలని సూచించారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో విద్యా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్కా వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కాటపల్లి లతా రాంచంద్రారెడ్డి, పాఠశాల నిర్వాహకులు ధర్మారెడ్డి, ప్రిన్సిపాల్ జయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీనస్ పాఠశాలలను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

దాసాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి



ప్రత్యేక పూజలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: ఆలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయానికి ఎదురుగా ఉన్న పురాతన శ్రీదాసాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం నిర్వహించిన కలశ పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతు ఆలయ నిర్మాణానికి విరాళంగా రూ.5,01,116ల చెక్కును అందజేశారు. గుడి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన సూచించారు. ప్రతిరోజూ జరిగే పూజలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు. కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, చీరాల నర్సింహ, నేతలు బొబ్బల లక్ష్మారెడ్డి, కొత్త రవిగౌడ్, కొత్త కిశోర్‌గౌడ్, వెంకటేశ్‌గుప్త, బాల్‌రాజ్‌గౌడ్, రాసాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ఉప్పల్: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలకు టూరిజం శాఖ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్తా ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లోని గోవర్ధన్ అకాడమిలో మూడు రోజులుగా నిర్వహించిన పోటీలు ఆదివారం ముగిశాయి. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉత్తేజాన్ని ఇస్తాయని తెలిపారు. అండర్-13, అండర్-15, 17, 19 జూనియర్స్ అండ్ సీనియర్స్‌లో పోటీలు జరిగాయి.



బహుమతులను అందజేస్తున్న ఉప్పల శ్రీనివాసగుప్తా

శ్రీరంగనాథస్వామి ఆలయానికి మైక్‌సెట్



కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని శ్రీరంగనాథస్వామి ఆలయానికి బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధులు మైక్‌సెట్‌ను సమకూర్చారు. ఆదివారం ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి మైక్‌సెట్‌ను ఆలయ ప్రతినిధులకు అందజేశారు. కోలాట భజన బృందం కోసం మైక్‌సెట్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భజన బృందం సభ్యులు సరోజినిదేవి, లక్ష్మీతులసీ, లక్ష్మీ చంద్రావతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

కుషాయిగూడ: గంజాయి మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేసిన ఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు హెచ్‌బీకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన శివ అలియాస్ కోతి శివ అనే యువకుడు గంజాయికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం సమయంలో గంజాయి మత్తులో రోడ్డుపైకి వచ్చిన శివ కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాడని వాపోయారు. అటువైపుగా వచ్చిన రెండు ఆర్టీసీ బస్సుల అద్దాలతో పాటు ఆటో స్టాండ్‌లో నిలిపిన మూడు ఆటోల అద్దాలు పగులగొట్టి హంగామా చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిపై కత్తితో దాడికి యత్నించాడని, స్థానికులు అతడి వారించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అయితే ఇతడు గతంలో కూడా గంజాయి తాగి రోడ్ల వెంట నడుచుకుంటూ వెళ్లేవారిని, వాహనాలపై వెళ్లేవారిని బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడన్నారు. ఇప్పటికే అతడిపై పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. డివిజన్‌లో చాలామంది యువకులు, మైనర్ పిల్లలు గంజాయి విచ్చలవిడిగా సేవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్పా పూర్తిస్థాయిలో కట్టడి చేయడంలో విఫలమయ్యారంటూ ఆరోపిస్తున్నారు. ఇకనైనా గంజాయిని కట్టడి చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వందల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: మధురా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ డివిజన్ ఫాదర్ బెండల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వందలాది మంది క్యూలో నిలబడి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు నిరుపేదలైన వందలాది మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నట్లు చెప్పారు. మహిళలు స్వశక్తిపై నిలబడే విధంగా వారికి అనేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు తెలిపారు. మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. అంతకుముందు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ట్రస్టు సేవలను స్థానికులు కొనియాడారు. కార్యక్రమంలో ఫాదర్ జోసఫ్, ప్రవీణ్, బ్రదర్ తుంబి జోసెఫ్, పలకల నరసింహారెడ్డి, యువజన కాంగ్రెస్ కార్యదర్శి సాయిబాబా, గజ్జల రాజు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి పాలమ్మితే.. పూలమ్మితే.. మనకేంది..?'

ఘట్‌కేసర్: మంత్రి మల్లారెడ్డి పాలమ్మితే కనకేంది.. పూలమ్మితే మనకేంది.. మనకేం చేస్తడో చెప్పాలే.. చేసేది తక్కువ.. చెప్పేది ఎక్కువ అంటూ సొంత పార్టీ మంత్రిని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి విమర్శించారు. ప్రతాపసింగారం రైతు వేదిక ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణరావు కాలువలో జంతువుల కళేబరాలు వేయడంతో దుర్వాసన వస్తోందని, కాలువ కూరుకుపోయి సాగునీరు అందడం లేదని, డ్రైనేజీ, రసాయన నీటితో ప్రజలు అనారోగ్యం పాలువుతున్నారని రైతులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించే సత్తా ఆయనకుందని, అక్కడక్కడా తిరుగుతడు ఇక్కడ రావాలటే.. భయపడతడని విమర్శించారు. మనందరం ఏదో వ్యవసాయం ఇతర కార్యకలాపాలు చేసి పైకి వచ్చినోళ్లమే.., మనలో చాలామంది పాలమ్మితే, పూలమ్మితే రాలేదు. సైకిల్ మీద పాలు కొట్టిండ్రు.. కోట్లేమీ రాలేదు.. ఆయనకు ఎట్లచ్చినవో భగవంతుడికి తెలుసన్నాడు. మంత్రి మల్లారెడ్డికి రైతుల సమస్యలు పట్టవని, రైతు సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని తెలిపారు. అవసరమైతే అన్నదాతల సమస్యల పరిష్కారానికి ధర్నా చేపడదామని అన్నారు.

దశాబ్ది ఉత్సవం.. ట్రాఫిక్‌తో నరకం..



ఉప్పల్: ఉప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన పోలీసుల ర్యాలీ, ఉప్పల్ చౌరస్తాలో తెలంగాణ మానవ హారం ప్రజలను చిక్కుల్లో పడేసింది. గంటల పాటు సాధారణ ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సాయంత్రం కావడంతో ఉప్పల్ పరిసర ప్రాంతాల రద్దీగా మారాయి. మానవహారం కోసం పోలీసులు ట్రాఫిక్‌ను దారి మళ్లించినా ఫలితం లేకుండా పోయింది. హబ్సిగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను లిటిల్ ఫ్లవర్ పాఠశాల వెనుకభాగం నుంచి దారి మళ్లించారు. ఆ దారి ఇరుగ్గా ఉండటంతో పాటు పార్కింగ్‌లను తొలగించకుండా దారి మళ్లించడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దాదాపు 2 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుని వాహనదారులు ఉక్కిరిబిక్కిరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం మండలంలోని రేకులబావి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు దాటుతున్న మహారాష్ట్రకు చెందిన ఆనంద్(32)ను తూప్రాన్ నుంచి నగరం వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరు పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని యువకుడు..

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరొకరు గాయాలపాలైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి లక్ష్మీనగర్ కాలనీకి చెందిన శివశంకర్(19) మిత్రుడు సాయిప్రకాశ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కండ్లకోయలోని సాయి గీత ఆశ్రమం నుంచి కండ్లకోయ వైపు వస్తుండగా కండ్లకోయ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్‌ను బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా సాయిప్రకాశ్ గాయాలపాలయ్యాడు. మేడ్చల్ పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. శివశంకర్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.